# నెల్లూరు నలుమూలల్లో

[illegible]

## మునిసిపాలిటీలో అవినీతి శృతిమించింది

నెల్లూరు మునిసిపాలిటీలో అవినీతి వ్యవహారం శృతిమించి పోయిందని ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఆరోపించారు. 11తేది తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణ అభివృద్ధికి వస్తున్న నిధులను మునిసిపాలిటీలో వివిధ రకాల కుంభకోణాల ద్వారా స్వాహా చేస్తున్నారు. పట్టణంలో సిమెంటు రోడ్లు వేయను ఎమ్మెల్యే లిచ్చిన నిధులతో బూడిదతో రోడ్లు వేసి 50లక్షల రూపాయల నిధులు స్వాహా చేశారు. మునిసిపాలిటీలో అవినీతిపై విచారణలు కంటి తుడుపుగా తయారయ్యాయి. ఎన్.ఎస్.డి.పి పథకంలో భాగంగా వచ్చిన పైపులలో 15లక్షల రూపాయల విలువ చేసే పైపులను అక్రమంగా అమ్ముకొన్నారు. నేను కష్టపడి మునిసిపల్ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు తెచ్చాను; వాటిని దుర్వినియోగం చేశారు. ఈ వ్యవహారాన్ని అంత సామాన్యంగా వదలను. అవినీతిని అడ్డుకోకపోతే పట్టణాభివృద్ధి ఎలా సాధ్య మవుతుందన్నారు. 9తేది మునిసిపాలిటీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి అనంతకుమార్‌కు చేసిన పౌరసన్మానానికి తనను ఆహ్వానించక పోవడంపై వివేకానందరెడ్డి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ విషయమై మునిసిపల్ కమీషనర్, ఛైర్మన్‌పై శాసనసభలో హక్కుల ఉల్లంఘన కింద నోటీసు ఇస్తానని వివరించారు.

## ఎస్పీవచ్చి ఏడాదయ్యింది

జిల్లా ఎస్పీగా కె.శ్రీనివాసరెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించి ఈ రోజు (12తేదికి) ఏడాదయ్యింది. పలువురు ఎస్పీలు జిల్లాలో మూడు, నాలుగేళ్లు పనిచేసినా వారెవరూ తెచ్చుకోలేని మంచి పేరు, ప్రజాభిమాన పాత్రుల య్యారు శ్రీనివాసులురెడ్డి. కేసుల పురోగతిలోను అవినీతికి సింహ స్వప్నం కావడం, నిష్పాక్షికత అన్నింటికి మించి ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో వుండడం వల్ల ఎస్పీ వార్తల లోని వ్యక్తయ్యారు. భవిష్యత్తులోనూ శ్రీనివాసరెడ్డి ఇదే ధోరణిలో పనిచేస్తే జిల్లా పోలీసు వ్యవస్థలో కొద్ది మేరైన మార్పు, చేర్పులు జరుగుతాయని ఆకాంక్షిస్తున్నాం.

## బుచ్చికి వెంకయ్య కానుక

తాను బాల్యంలో చదువుకొన్న గ్రామం బుచ్చిరెడ్డిపాళెంపై మమకారంతో 75లక్షల రూపాయల పెద్ద మొత్తాన్ని కానుకగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్య నాయుడు ఇచ్చించారు. ఈ నిధులకు ప్రజల నుంచి సేకరించే మరో 25శాతం నిధులను జతకలిపి దేశంలో మొట్టమొదటి సారిగా ప్రజల భాగస్వామ్యంతో పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా బుచ్చిలో చేపడతారు. మొత్తం నిధులు కోటి రూపాయలతో గ్రామంలో మాస్టర్ డ్రైనేజి పథకాన్ని నిర్మిస్తారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే 75లక్షల రూపాయల నిధులను పంచాయతీ తిరిగి చెల్లించక్కర లేదు. ఈ పథకం విజయవంతమైతే జిల్లాలో పెద్ద పంచాయతీలైన అల్లూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, ఉదయగిరి, కోవూరుల్లో కూడా ఈ పథకం చేపట్టే అవకాశాలున్నాయి.

## సోమశిలలో నీరు

జిల్లాలో వ్యవసాయానికి ఆధారమైన సోమశిల ప్రాజెక్టులో నీళ్లు వచ్చి చేరాయి. కడప, నెల్లూరు జిల్లాలలో ఇటీవల పడిన వర్షం వల్ల ప్రస్తుతం సోమశిలలో 18 టిఎంసిలకు పైగా నీరు నిల్వ వున్నాయి. ఈ నీటిలో 50 క్యూసెక్కు లను ప్రతిదినం పెన్నార్ డెల్టాకు విడుదల చేస్తున్నారు. గడచిన మూడు నెలలుగా సోమశిలలో డెడ్‌స్టోరేజి కన్నా మూడు టిఎంసిల నీళ్లు తక్కువగా వున్నాయి.

## మంత్రుల పర్యటనను బహిష్కరించిన కాంగ్రెస్

ఈ నెల 9తేది నెల్లూరుకు వచ్చిన కేంద్ర మంత్రులు వెంకయ్యనాయుడు, అనంతకుమార్, బండారు దత్తాత్రేయ పాల్గొన్న కార్యక్రమాలను ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, మునిసిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్లు బహిష్కరించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పౌరసన్మానానికి ఎమ్మెల్యేను పిలవక పోవడం, 8తేది మునిసిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌కు మధ్య జరిగిన గొడవ దీనికి కారణమన వచ్చు. కాని ఎమ్మెల్యే, మునిసిపల్ కౌన్సిలర్లు ఆర్అండ్‌బి అతిథి గృహంలో మంత్రులను కలుసుకొని తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి, మునిసిపాలిటీకి మరిన్ని నిధులు మంజూరు చేయమన్నారు. వెంకయ్యనాయుడు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని విభేదాలు వీడి, రాజకీయాలకు తావులేకుండా పట్టణాభివృద్ధికి కృషి చేయమని సలహా ఇచ్చారు. సాయంత్రం కస్తూరిబా కళాక్షేత్రంలో కేంద్ర మంత్రికి జరిగిన సన్మానంలోనూ వెంక య్యనాయుడు ఈ విషయాన్ని ప్రస్తావించారు.

## నెల్లూరీయునికి పెద్ద పదవి

రాష్ట్రంలోని పలు రేడియో స్టేషన్ల డైరక్టర్‌గా వ్యవహరించి ఆ తర్వాత న్యూఢిల్లీ రేడియో స్టేషన్‌గా పనిచేస్తుండిన నెల్లూరీయుడు డాక్టర్ అనంత పద్మనాభరావును పెద్ద పదవి వరించింది. కేంద్ర ప్రభుత్వం ఆయనకు పదోన్నతినిస్తూ ఢిల్లీలో దూరదర్శన్ కేంద్రం డిప్యూటీ డైరక్టర్ జనరల్‌గా నియమించింది. ఈ పదవి ఆషామాషీ పదవికాదు; రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి అంతటి హోదాగల పదవి. పద్మనాభరావు నాలుగేళ్లపాటు ఈ పదవిలో వుంటారు. ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎక్కడున్నా నెల్లూరీయులను ఆప్యాయంగా పలకరిస్తారు పద్మనాభరావు. పెద్ద పదవిని పొందిన ఆయనను జమీన్‌రైతు మనసారా అభినందిస్తుంది.

## రాజరాజేశ్వరమ్మ శరన్నవరాత్రోత్సవాలు

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరమ్మ శరన్నవరాత్రోత్సవాలు ఈ నెల 17తేది నుంచి 26తేది వరకు జరుగుతాయి. 17తేది చండిగా, 18తేది భవానిగా, 19తేది గాయత్రిగా, 20తేది అన్నపూర్ణగా, 21తేది గజలక్ష్మిగా, 22తేది కాళికగా, 23తేది సరస్వతిగా, 24తేది దుర్గగా, రాజరాజేశ్వరమ్మను అలంకరిస్తారు. 25తేది మహిషాసుర మర్ధనిగా, 26తేది రాజరాజేశ్వరమ్మగానే అమ్మవారిని చూడవచ్చు. విజయదశమి రోజు ప్రత్యేక మహాభిషేక పూజ చేస్తారు. ఆకర్షణీయమైన సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తున్నందున భక్తులను దేవాలయానికి రమ్మంటున్నారు ఆలయ ధర్మకర్త రత్నం సుందరరాజా, కార్యనిర్వహణాధికారి వర్షినేని సాయిబాబా.

# ఉత్తరక్రియలు



స్వర్గీయ శ్రీమతి గునుపాటి శేషమ్మ

మా తల్లి

## శ్రీమతి గునుపాటి శేషమ్మ గారు

(స్వర్గీయ గునుపాటి వెంకటరమణారెడ్డి గారి సతీమణి)

తే 10-10-2001 ది బుధవారము పరమపదించినారు.
వారి పెద్దకర్మ తే 20-10-2001 ది శనివారము ఉదయం
నెల్లూరు, టెక్కామిట్ట, వారి స్వగృహమునందు జరుగును.
కావున తెలియజేయుడమైనది.

**కుమారులు**

గునుపాటి ఆదిశేషారెడ్డి
గునుపాటి హరిశ్చంద్రారెడ్డి

**కుమార్తెలు**

జక్కా కామేశ్వరమ్మ
ఆదాల సుశీలమ్మ

**మరియు కుటుంబసభ్యులు.**

